# కంటిపాపల్ని కడతేర్చి... కన్నతల్లి ఆత్మహత్య



మృతి చెందిన చిన్నారులు అశీశ్‌రెడ్డి, హర్షిత్ రెడ్డి (ఫైల్ ఫోటో), తేజస్విని (ఫైల్‌ఫోటో)

- **అరుదైన వ్యాధితో బాధపడుతున్న తల్లి, ఇద్దరు కుమారులు**
- **విసుక్కుంటూ 'చస్తే చావండి' అని తిట్టిన భర్త, భార్య మనస్తాపం**
- **కుమారులను కత్తితో నరికిచంపి, భవనం పైనుంచి దూకి ఆత్మహత్య**
- **"దేవుడా నా పిల్లలకు ఎందుకు ఇంత బాధ ఇచ్చావు?" అని లేఖ**
- **హైదరాబాద్ గాజులరామారంలో హృదయవిదారకమైన ఘటన**

జీడిమెట్ల, ఏప్రిల్ 17: కడుపున పుట్టిన పిల్లలను కన్నతల్లే కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఎంతకష్టమొచ్చినా నవమాసాలు మోసిన పిల్లల ఆలనాపాలనా చూసుకుంటుంది. కానీ తనకు ఉన్న ఓ అరుదైన కంటి వ్యాధి పిల్లలకు కూడా రావడంతో, ఆ బాధను భరిస్తూ జీవనం సాగిస్తున్నది. పిల్లలు, తన అనారోగ్యం పట్ల అందరూ హేళన చేశారు. ఆఖరికి కట్టుకున్న భర్త కూడా విసుక్కుంటూ 'చస్తే చావండి' అని అనడంతో మనస్తాపం చెందిన భార్య.. పిల్లలను చంపి, తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్ శివారు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారంలో జరిగింది.. ఈ హృదయవిదారకమైన ఘటన.

**బతుకుదెరువు కోసం వచ్చి తనువుచాలించి!**

గాజులరామారంలో జరిగిన విషాదఘటనపై జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీపంలోని చోడవరం గ్రామానికి చెందిన గాండ్ర వెంకటేశ్వరరెడ్డి భార్య తేజస్విని (35), వీరికి ఇద్దరు కుమారులు అశీశ్‌రెడ్డి (7), హర్షిత్‌రెడ్డి (5)తో కలిసి బాలాజీ లేఅవుట్‌లోని సహస్ర మహేశ్ హెయిట్స్ అపార్టుమెంట్‌లోని 204 ఫ్లాట్‌లో నివాసముంటున్నారు. ఇద్దరు పిల్లలకు అరుదైన కంటి వ్యాధి ఉంది. వీరికి రెండు గంటలకు ఒకసారి కంట్లో చుక్కల మందు వేయకుంటే నొప్పి తట్టుకోలేరు. గురువారం వెంకటేశ్వరరెడ్డి డ్యూటీకి వెళ్లగా ఇంట్లో తేజస్విని, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తేజస్విని అపార్టుమెంట్‌పై నుంచి దూకగా అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు తేజస్విని ఫ్లాటుకు వెళ్లిచూడగా వంటగదిలో ఇద్దరు కుమారులు రక్తపుమడుగులో పడి ఉన్నారు.

**ఆత్మహత్య లేఖలో కన్నీటి కథ**

తేజస్విని ఫ్లాటులో పోలీసులు 8 పేజీల ఓ లేఖ స్వాధీనం చేసుకున్నారు. "ఇద్దరు పిల్లలకు కంటి సమస్య ఉంది. రెండు గంటలకు ఒకసారి కంట్లో మందు వేయకుంటే పిల్లలు నొప్పితో ఏడుస్తారు. దేవుడా నా పిల్లలకు ఎందుకు ఇంత బాధను ఇచ్చావు? నన్ను అందరూ పిచ్చిది అంటున్నారు. కంటి నొప్పి సమస్యలతో బాధపడుతున్న నా పిల్లలను నేనే చంపుకున్నాను. ఇంతటి పరిస్థితి ఏ తల్లికీ రావద్దు. నా పిల్లలు లేని బతుకు నాకు ఎందుకు? నేను కూడా చనిపోతున్నాను. అమ్మా, నాన్నా ఐ యామ్ సారీ. ఆస్తిలో ఒక్క పైసా కూడా నా భర్తకు ఇవ్వవద్దు. ఆస్తి మొత్తం అనాథలు, స్కూల్ పిల్లలకు ఇవ్వండి" అంటూ తేజస్విని లేఖలో పేర్కొంది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మంత్రి పదవి ఇవ్వకుంటే
# భరతం పడుతం

- **సీఎం, రెడ్డి సామాజిక వర్గం మంత్రులకు మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అభిమానుల హెచ్చరిక**
- **ముదిరాజ్ సంఘం పేరిట లేఖలు**
- **సీఎం సొంత జిల్లాలో కలవరం**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా చేశావో.. నీ భరతం పట్టడం.. నిన్ను సీఎం పదవి నుంచి దించడం ఖాయం' అని పేర్కొంటూ సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో విడుదలైన లేఖ కలకలం సృష్టిస్తున్నది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రెడ్డి సామాజిక వర్గ మంత్రులను హెచ్చరిస్తూ ఈ లేఖలు గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో కొంతమందికి పోస్ట్ ద్వారా అందాయి. గతంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వొద్దని.. అనేక అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కొందరు ఆయనకు వ్యతిరేకంగా సిరీస్ లేఖలు విడుదల చేశారు. తర్వాత ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమనుకున్నారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం, మంత్రులను హెచ్చరిస్తూ తాజాలేఖ విడుదలైంది. పోలీసు యంత్రాంగం ఎమ్మెల్యే ఆదేశాలతో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ లేఖతో ముదిరాజ్ సామాజిక వర్గానికి.. పార్టీకి సంబంధం లేదని, కొందరు కావాలని సృష్టిస్తున్నారని ఆ పార్టీ ముదిరాజ్ నాయకుడు కోళ్ల వెంకటేశ్ వెల్లడించారు.



ముఖ్యమంత్రితోపాటు రెడ్డి సామాజికవర్గ మంత్రులను హెచ్చరిస్తూ విడుదలైన లేఖ

**లేఖలో ఏముందంటే!**

'రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం, మంత్రులకు హెచ్చరిక.. మేము (ముదిరాజ్ సామాజిక వర్గం) తెలంగాణ జనాభాలో మొదటి స్థానంలో ఉన్నం. మా సామాజిక వర్గం నుంచి ఒకే ఒక్క ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎన్నికయ్యారు. మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తామని మీరు హామీ ఇచ్చారు. ఇంతవరకు ఊసెత్తడం లేదు. మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా మీరు అడ్డుపడుతున్నరు. మా ఎమ్మెల్యేకు టికెట్ మీ దయా దాక్షిణ్యాలపై రాలేదు.. ఆయనపై మల్లికార్జున ఖర్గే ఆశీస్సులున్నయి. నువ్వు.. నీ సామాజిక వర్గంవారు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మంత్రి పదవి ఖాయం. నువ్వు నీలం మధు ముదిరాజ్‌తో కుమ్మక్కై వంద కోట్ల బేరం కుదుర్చుకొని అతడికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని ప్రయత్నం చేసినవు. ఈ విషయం ఏఐసీసీకి తెలిసి నీకు మొట్టికాయలు వేసింది. ఖబడ్దార్ బిడ్డా.. నీ పలుకుబడి ఉపయోగించి మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా చేశావో నీ భరతం పట్టడం ఖాయం. రాష్ట్రంలో కాంగ్రెస్ ఖతం.. నిన్ను సీఎం పదవి నుంచి దించడం అనివార్యం'

# ఇడియట్ మాటలు మాట్లాడకు!

- **తహసీల్దార్‌పై ప్రభుత్వ విప్ నాయక్ ఆగ్రహం**
- **ఇసుక రవాణాకు అనుమతించాలని హుకూం**
- **ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌ను, నాదీ కలెక్టర్ ర్యాంకేనంటూ దౌర్జన్యం**
- **మరిపెడ మండలంలోనూ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు**



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం విస్సంపల్లిలో తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

చిన్నగూడూరు/మరిపెడ, ఏప్రిల్ 17 : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ అధికారులపై నోరుపారేసుకున్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు, మరిపెడలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన అధికారులపై తీవ్రపదజాలాన్ని ఉపయోగించారు. చిన్నగూడూరు మండలం విస్సంపెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ తహసీల్దార్‌తో మాట్లాడుతూ.. ఇసుక రవాణా అనుమతులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇడియట్ మాటలు మాట్లాడకు.. ఇసుక రవాణాకు అనుమతించడంలేదు ఎందుకు? ప్రభుత్వ విప్‌ను, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌ను, నాదీ కలెక్టర్ ర్యాంకే, ఇసుక రవాణాకు టోకెన్ సిస్టం పెట్టి ప్రభుత్వ పనులకు తక్షణమే అనుమతించండి. రిటైర్మెంట్ సమయంలో సస్పెండ్ కాకుండా చూసుకోండి. రాత్రీపగలు తేడా లేకుండా ఆకేరు ఇసుకను దొంగలపాలు చేస్తున్నరు. ఈ పాపం మీదే. పోలీస్, రెవెన్యూ శాఖ సమన్వయంతో పనిచేయండి' అంటూ హెచ్చరించారు.

**ఎవరూ నా మాట వినడం లేదు**

మరిపెడ మండలం గిరిపురంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో కలెక్టర్ ముందే ఎమ్మెల్యే అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. 'నియోజకవర్గంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎస్సైలు, కార్యదర్శులు ఎవరూ నా మాట వినడం లేదు. నా పదవి ఇప్పుడే అయిపోదు. అధికారులు ఉద్యోగాలు చేయడం ఇష్టం లేకుంటే రాజీనామా చేసి వ్యాపారాలు చేసుకోండి' అని హెచ్చరించారు. అధికారులు ఉద్యోగాలకు వచ్చామా?, పోయామా? అన్నట్టు వ్యవహరించడం సరికాదని అన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు కట్టడి చేయడం లేదని మండిపడ్డారు.

**ట్రెసా ఖండన..**

ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ చిన్నగూడూరు, మరిపెడ తహసీల్దార్లను దూషించడాన్ని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్, సర్వీస్ అసోసియేషన్ (ట్రెసా) జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, తహసీల్దార్ల అసోసియేషన్ నాయకులు సైదులు, భగవాన్‌రెడ్డి, నాగరాజు, సునీల్‌రెడ్డి, మహబూబ్ ఓ ప్రకటనలో ఖండించారు. జీవోను కాదని ఇసుక అనుమతులు ఇచ్చే అధికారం అధికారులకు లేదనే విషయం ఎమ్మెల్యే గ్రహించకుండా తహసీల్దార్లను దూషించడం తగదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్న తహసీల్దార్లపై సభాముఖంగా అనుచిత వ్యాఖ్యలు చేసి, వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

## మెట్రో పనులపై కౌంటరు దాఖలు చేయండి
**ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు చేపట్టిన మెట్రో రైలు విస్తరణ పనుల్లో భాగంగా పురావస్తు కట్టడాల కూల్చివేతలపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు గురువారం ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో పిటిషనర్లు దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంటూ విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు చేపట్టిన నాలుగో కారిడార్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మెట్రో రెండో దశ విస్తరణ పనులను నిలిపివేసేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు రహీంఖాన్ పిల్ దాఖలు చేశారు.

దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రస్తుతం చేపట్టిన విస్తరణ పనుల వల్ల పరిసర ప్రాంతాల్లోని చారిత్రాత్మక కట్టడాలపై ప్రభావం పడుతుందని చెప్పారు. చార్మినార్, ఫలక్‌నుమా, పురాణీ హవేలి, దారుల్‌షిఫా, మొఘల్‌పురా టూంబ్స్ తదితర కట్టడాలకు ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. ఇక్కడ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే అక్కడ అధికారులు కూల్చివేత పనులు చేపడుతున్నారని చెప్పారు. అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ దీనిపై సమగ్ర వివరాలతో కౌంటరు దాఖలు చేయడానికి ఈ నెల 22 వరకు గడువు కోరారు. తదుపరి విచారణ దాకా పురావస్తు కట్టడాలుగా ప్రకటించినవాటి జోలికి వెళ్లబోమని హామీ ఇచ్చారు. దీన్ని రికార్డు చేసిన ధర్మాసనం విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

# జీతాలు అడిగినందుకు ఉద్యోగాలు ఊస్ట్!

- **నేరుగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డికే ఫిర్యాదు చేస్తరా?**
- **పంచాయతీ కార్మికులపై మండిపడ్డ అధికారులు**
- **ఐదుగురిని తొలగిస్తూ ఆదేశాలు**
- **ఇదెక్కడి న్యాయమంటున్న కార్మికులు**

తొర్రూరు, ఏప్రిల్ 17 : జీతాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరినందుకు గ్రామపంచాయతీ కార్మికులను పనిలోకి రావొద్దని చెప్పిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెంలో జరిగింది. బుధవారం చర్లపాలెం పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని జీపీ కార్మికులు ధర్మారపు వెంకటమ్మ, జయమ్మ, చింతకుంట్ల సత్తయ్య, చిట్టిమల్ల సాయిలు, ధర్మారపు మల్లమ్మ, ధర్మారపు మైబ కలిశారు. తమకు ఏడాదికాలంగా జీతాలు రావడంలేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. దీంతో సదరు ఐదుగురిని గురువారం నుంచి విధులకు రావొద్దని అధికారులు చెప్పడం గమనార్హం.

**జీతాలు అడగొద్దా సారూ..**

నేను చర్లపాలెం జీపీలో ఏడేండ్లుగా పని చేస్తున్నా. ఏడాదిగా జీతాలు వస్తలేవు. ఎన్ని సార్లు అధికారులను అడిగినా ఇప్పిస్తాం అంటూ కాలం గడుపుతున్నారు. బుధవారం చర్లపాలెంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి రావడంతో సమస్యను చెప్పుకొన్నా. అమ్మా, జీతాలు రావడం లేదు. ఒకసారి చూడండి.. అని బతిమిలాడా.. 'నువ్వు ఎమ్మెల్యేకు ఎలా ఫిర్యాదు చేస్తావు' అని అధికారులు ఆగ్రహం వ్యక్తంచేసి గురువారం నుంచి పనిలోకి రావొద్దని చెప్పారు. జీతం అడిగితే ఉద్యోగంలో నుంచి తీసేస్తారా? ఇదేనా న్యాయం? నేనేమి తప్పు చేశాను? దయచేసి కార్మికుల బతుకులను ఓసారి గమనించండి. ఉద్యోగం తీసేస్తే ఎలా బతికేది?

– ధర్మారపు వెంకటమ్మ, జీపీ కార్మికురాలు

**వాణిజ్య**



# వృద్ధి అంచనాకు కత్తెర

**ఈసారి దేశ జీడీపీ 6.4 శాతమే • టారిఫ్ వార్ నేపథ్యంలో ఫిచ్ రేటింగ్స్**

- గత 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను భారత జీడీపీ అంచనాను 6.3 శాతం నుంచి 6.2 శాతానికి కుదించిన ఫిచ్ రేటింగ్స్.
- ప్రస్తుత 2025-26లోనూ దేశ వృద్ధిరేటు 6.5 శాతం కాదు.. 6.4 శాతమే నన్న ఫిచ్. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లోనూ 6.3 శాతానికే దేశ ఆర్థిక ప్రగతి పరిమితం కావచ్చని అంచనా.
- ఈ 2025-26లో భారత జీడీపీ 6.7 శాతం కాదు గానీ.. 6.5 శాతంగా ఉండొచ్చంటున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.
- ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 6.5 శాతంగానే దేశ జీడీపీ అంటున్న ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్.
- ఈ ఏడాదికి (2025)గాను ఏకంగా 30 బేసిస్ పాయింట్లను తగ్గిస్తూ దేశ జీడీపీని 6.1 శాతంగానే అంచనా వేసిన మూడీస్.
- 2025లో భారత జీడీపీ 6.5 శాతంగా ఉండొచ్చన్న యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ).




న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ప్రముఖ గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్.. భారత వృద్ధిరేటు అంచనాలకు కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశ జీడీపీ ప్రగతి 6.4 శాతానికే పరిమితం కావచ్చని గురువారం పేర్కొన్నది. మునుపటితో పోల్చితే 10 బేసిస్ పాయింట్లు తగ్గడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరానికీ (2024-25) జీడీపీ అంచనాను 6.2 శాతానికే ఆపేసింది. ఇంతకు ముందు ఇది 6.3 శాతంగా ఉన్నది. ఇప్పటికే ఇటీవలి ద్రవ్యపరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా దేశ వృద్ధిరేటు అంచనాలకు కత్తెర వేసిన విషయం తెలిసిందే. ఈసారి 6.7 శాతం కాదు.. 6.5 శాతమేనని చెప్పింది. మూడీస్, ఎస్అండ్‌పీ మరికొన్నీ ఇదే అభిప్రాయాలిచ్చాయి. దీనికి ఫిచ్ అంచనాలూ తోడవగా, దేశ ఆర్థిక ప్రగతిపై సర్వత్రా ఆందోళనల్ని రేకెత్తిస్తున్నాయి.

**ఇదీ సంగతి..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాల నేపథ్యంలోనే దేశ జీడీపీ అంచనాలను తగ్గిస్తున్నట్టు రేటింగ్‌ఏజెన్సీలు చెప్తున్నాయి. ఇప్పుడు ఫిచ్ కూడా అదే స్పష్టం చేసింది. అమెరికా-చైనాలు తాడోపేడో తేల్చుకుంటుండగా, ఇతర దేశాలకు మాత్రం 90 రోజుల మినహాయింపుతో ఊరట దక్కిన విషయం తెలిసిందే. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ఏ ఒక్క దేశం ఇబ్బందుల్లో పడినా.. ఆ ప్రభావం మిగతా దేశాలపైనా ఎంతోకొంత ఉంటుంది. అలాంటిది రెండు అగ్రదేశాలే పరస్పర సుంకాలతో దాడులు చేసుకుంటుండటంతో ఆ సెగ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకూ గట్టిగానే తగులుతున్నది. ఈ క్రమంలో ఇప్పటికైతే భారత్‌పై నేరుగా సుంకాల పోటు లేకున్నా.. అగ్రరాజ్యంతో ఒప్పందాలు కుదరకపోతే జూలైలో టారిఫ్‌ల దెబ్బ ఖాయమన్న అభిప్రాయాలున్నాయి. పైగా కనీస సుంకాలు ఎటూ ఉండనే ఉంటాయి. ఇవన్నీ కూడా తాజా ఫిచ్ రేటింగ్స్ అంచనాలకు అద్దం పడుతున్నాయి. ఈ ఏడాదికిగాను ప్రపంచ జీడీపీ అంచనానూ 0.4 శాతం దించింది ఫిచ్. చైనా, అమెరికాల వృద్ధినీ 0.5 శాతం మేర పడేసింది మరి.

**కీలక రంగాలు కుదేలు**


దేశంలో మందగించిన వినియోగదారుల కొనుగోలు శక్తి కారణంగా కీలక రంగాలు కుదేలయ్యాయి. ముఖ్యంగా తయారీ రంగం పేలవ ప్రదర్శననే చేస్తున్నది. ఫిబ్రవరిలో 6 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 2.9 శాతంగానే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) నమోదైంది. గతంతో పోల్చితే ఉత్పాదక రంగ కార్యకలాపాలు 2 శాతం పడిపోయినట్టు తేలింది. గనులు, విద్యుదుత్పత్తి రంగాలూ నిరాశపర్చాయి. ఈ నేపథ్యంలో ఫార్మా, టెక్స్‌టైల్, స్టీల్, కెమికల్స్ తదితర రంగాలను ట్రంప్ టారిఫ్‌ల భయాలు చుట్టుముడుతున్నాయి. నిజానికి ఆశించిన డిమాండ్ లేక మార్కెట్‌లో నిస్తేజం ఆవరించింది. ఈ సమయంలో ఎగుమతులు కూడా ప్రమాదంలో పడేలా అమెరికా తీరుంటున్నది. మొత్తానికి రాబోయే రోజుల్లో అమెరికా సృష్టించిన టారిఫ్ వార్.. మాంద్యం ముప్పును తెస్తుందా? అన్న అనుమానాలైతే బలంగా ఉన్నాయని చెప్పవచ్చు. కరోనా మహమ్మారి ప్రభావం నుంచి కోలుకొని మునుపటి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్న ఎకానమీలపై ట్రంప్ రూపంలో పిడుగు పడ్డట్టైంది.




దేశీయ మార్కెట్‌లోకి స్కోడా తమ కోడియాక్ వేరియంట్‌లో సరికొత్త మాడల్‌ను తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.89 లక్షలు

# లాభాల జోష్‌లో మార్కెట్లు

**సెన్సెక్స్ 1,509, నిఫ్టీ 414 పాయింట్లు అప్**



ముంబై, ఏప్రిల్ 17: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో పరుగులు పెడుతున్నాయి. గురువారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మరో 1,508.91 పాయింట్లు లేదా 1.96 శాతం పుంజుకొని 78వేల మార్కుకు ఎగువన 78,553.20 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 414.45 పాయింట్లు లేదా 1.77 శాతం ఎగిసి 23,851.65 వద్ద నిలిచింది. దీంతో నాల్గోరోజూ సూచీలు లాభాల్లో ముగిసినట్టైంది. ఈ నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 4,706.05 పాయింట్లు లేదా 6.37 శాతం, నిఫ్టీ 1,452.50 పాయింట్లు లేదా 6.48 శాతం ఎగబాకాయి. ప్రతీకార సుంకాలపై అమెరికాతో ఆయా దేశాలు చర్చలకు ఉపక్రమిస్తుండటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. ఈ క్రమంలోనే అమెరికా-జపాన్ మధ్య సంప్రదింపులు.. లాభాల కొనసాగింపునకు దోహదం చేశాయి. ఇదిలావుంటే బ్యాంకింగ్, టెలికం, ఆర్థిక సేవలు, సేవా రంగం, టెక్నాలజీ. ఎనర్జీ, ఆటో, హెల్త్‌కేర్ రంగాల షేర్లు 2.56 శాతం నుంచి 0.91 శాతం మేర లాభాలను అందిపుచ్చుకున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభపడ్డాయి.



గురువారం టోక్యోలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న మారుబెనీ కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

# 'ఫ్యూచర్'లో జపాన్ ఇండస్ట్రీ!


**రూ.1,000 కోట్ల పెట్టుబడితో మారుబెనీ నెక్స్ట్ జనరేషన్ పార్కు**

హైదరాబాద్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ): జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ.. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో తర్వాతి తరం ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధుల బృందంతో మారుబెనీ సంస్థ ప్రతినిధులు గురువారం టోక్యోలో సమావేశమయ్యారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై ఈ సందర్భంగా వారు చర్చించారు. దాదాపు రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టును చేపట్టనున్నది. ఇదిలావుంటే దశలవారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచస్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు కంపెనీ ప్రతిపాదనలు తయారు చేసుకున్నది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఇక్కడ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి సారించనున్నది. దీంతో దాదాపు 30వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వ వర్గాల అంచనాగా ఉన్నది.

# హైదరాబాద్ రియల్టీ ఢమాల్

**జనవరి-మార్చిలో 26 శాతం క్షీణించిన ఇండ్ల అమ్మకాలు**

**10,647 యూనిట్లకే పరిమితం.. ప్రాప్‌టైగర్ తాజా నివేదికలో వెల్లడి**



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: దాదాపు దశాబ్దకాలం భారతీయ నిర్మాణ రంగానికే తలమానికంగా వెలుగొందిన హైదరాబాద్ రియల్టీ ప్రతిష్ఠ.. సుమారు గత ఏడాదిన్నరగా మసకబారిపోతున్నది. ఇండ్ల విక్రయాల్లో దేశంలోని అన్ని ప్రధాన నగరాలను వెనుకకు నెడుతూ వృద్ధిపథంలో నడిచిన ఇక్కడి రియల్ ఎస్టేట్.. ఇప్పుడు అమ్మకాల్లేక డీలా పడిపోయింది మరి. ప్రతికూల పరిస్థితుల్లోనూ సత్తా చాటిన హైదరాబాద్‌లో.. రోజులు గడుస్తున్నకొద్దీ హౌజింగ్ సేల్స్ అంచనాలను అందుకోలేక నిరాశపరుస్తూనే ఉన్నాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ ప్రాప్‌టైగర్ తాజా నివేదికలోనూ నిరుత్సాహకర గణాంకాలే నమోదవడం రియల్ ఎస్టేట్ వర్గాలను ఒకింత విస్మయానికే గురిచేస్తున్నది.


**26 శాతం డౌన్**

ఈ ఏడాది జనవరి-మార్చికిగాను ప్రాప్‌టైగర్ విడుదల చేసిన రిపోర్టులో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు గతంతో పోల్చితే 26 శాతం పడిపోయినట్టు తేలింది. గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో 14,298 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. అయితే ఈ ఏడాది అవి 10,647 యూనిట్లకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు, నెమ్మదించిన పాలసీ నిర్ణయాలతోపాటు హైడ్రా భయాలు అన్నీ కలిసి రియల్ ఎస్టేట్ వృద్ధిని కాలరాశాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే క్రమేణా ఇండ్ల కొనుగోళ్లకు అంతా దూరం జరుగుతున్నారు.

**బెంగళూరు.. చెన్నై జూమ్**

మరోవైపు పొరుగు రాష్ర్టాల రాజధానుల్లో హైదరాబాద్‌తో పోల్చితే భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజా రిపోర్టులో బెంగళూరులో 13 శాతం హౌజింగ్ సేల్స్ పెరిగినట్టు తేలింది. ఏడాది క్రితం 10,381 యూనిట్ల అమ్మకాలే జరిగితే.. ఈ జనవరి-మార్చిలో మాత్రం 11,731 యూనిట్లు అమ్ముడుపోయాయి. అలాగే చెన్నైలో 4,427 యూనిట్ల నుంచి 4,774 యూనిట్లకు పెరిగి సేల్స్‌లో 8 శాతం వృద్ధి కనిపించింది. కాగా, హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై-ఎంఎంఆర్, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా, అహ్మదాబాద్‌ల్లోని ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌టైగర్ ఈ నివేదికను విడుదల చేసింది. మొత్తంగా చూసినట్టైతే ఈ 8 నగరాల్లో 19 శాతం విక్రయాలు పడిపోయాయి. 98,095 యూనిట్లుగానే ఉన్నట్టు తేలింది. అధిక ధరలు, డిమాండ్ లేమి, ఆగిన కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలు మార్కెట్‌ను దెబ్బతీశాయి.

# ఆల్ టైమ్ హైకి బంగారం ధరలు




న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: బంగారం ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. అయినప్పటికీ దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైగా నిలిచాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పసిడి తులం విలువ రూ.70 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా రూ.98,170గా నమోదైంది. బుధవారం ఒక్కరోజే రూ.1,650 ఎగబాకి తొలిసారి రూ.98వేల మార్కును గోల్డ్ రేటు అధిగమించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మాత్రం పుత్తడి ధరలు విజృంభించాయి. 24 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.1,140 ఎగిసి రూ.97,310కి చేరింది. అలాగే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా నగల బంగారం) రేటు రూ.1,050 అందుకుని రూ.89,200 వద్ద నిలిచింది. కాగా, ఈ ఏడాది మొదలు పసిడి ధర దేశీయంగా 10 గ్రాములు రూ.19,220 లేదా 24 శాతం ఎగిసింది. గత ఏడాది డిసెంబర్ 31న తులం రేటు రూ.78,950 వద్ద ముగిసింది. వెండి విషయానికొస్తే.. రూ.1,400 క్షీణించి కిలో ధర రూ.98,000కు పరిమితమైంది. ఇక గ్లోబల్ స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 3,357.81 డాలర్లు పలికింది. సిల్వర్ 32.32 డాలర్లుగా ఉన్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాలు.. ప్రపంచవ్యాప్తంగా స్టాక్, బాండ్ మార్కెట్లలో తీవ్ర అలజడులను సృష్టిస్తున్నాయి. ఈ ఒడిదుడుకుల నుంచి తప్పించుకొనేందుకు మదుపరులు తమ పెట్టుబడులను పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారు.